నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాప్రా: విద్యుత్ విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపుతో సైనిక్‌పురి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు కాలనీలకు మంగళ వారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సత్యనా రాయణ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శాలివాహన, కృష్ణానగర్, గౌరీనాథ్‌పురం, పద్మారావు నగర్, హైటెక్‌కాలనీ, తాళ్లబాయి, దాబాగార్డెన్, ఎల్లారెడ్డిగూడ విలేజ్, మనోజ్ ఎన్‌క్లేవ్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శాంతివిహార్, గ్రీన్‌పార్క్, అశోక్‌కాలనీ, కాప్రా విలేజ్, రాందాస్‌నగర్‌లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు సహకరించాలని ఏఈ సత్యనారాయణ కోరారు.

సర్వాయి పాపన్నకు ఘన నివాళి



రామంతాపూర్: వెంకట్‌రెడ్డినగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే భేతిసుభాష్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, ఆనంద్‌కుమార్, బాలకృష్ణగౌడ్, యాదగిరిగౌడ్, కైలాసపతిగౌడ్, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్‌పటేల్ పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

బోడుప్పల్: సీపీఐ పార్టీ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఇందిరానగర్ చౌరస్తాలో మండల కార్యదర్శి రచ్చకిషన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 19 నుంచి 22 వరకు మహాసభలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. మండల సీపీఐ సహాయ కార్యదర్శి సీహెచ్.మాధవి, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బాపిరాజు, బీకేఎంయూ మండల కార్యదర్శి మహాలక్ష్మి, నాయకులు ఇస్తారి, సోమరాజు, సీహెచ్.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

19 నుంచి 'హలో మాల - ఛలో ఢిల్లీ' నిరసన

గౌతంనగర్: ఈనెల 19,20,21వ తేదీల్లో ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే 'హలో మాల - ఛలో ఢిల్లీ' నిరసన కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఆవిష్కరించారు. అనంతరం మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు పసుల రాంమూర్తి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఈనెలలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మోహన్‌బాబు, ఆషుతోష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

రామంతాపూర్: సత్యానగర్‌లో భూగర్భ డ్రైనేజీ సౌకర్యం లేక మురుగు రోడ్లపై ప్రవహిస్తోందని స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అధిక శాతం పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులను త్వరలో ప్రారంభిస్తామని, సత్యానగర్‌లో పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ పనులను కూడా ప్రారంభిస్తామని వివరించారు. జలమండలి మేనేజర్ రవీందర్, కిషన్, స్థానిక సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

మల్లాపూర్: మల్లాపూర్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. ఓల్డ్ మల్లాపూర్‌లో కొనసాగుతున్న సీసీరోడ్డు నిర్మాణాన్ని సోమవారం పరిశీలించిన ఆయన పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని సూచించారు. అనంతరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చాంబర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఏఈ స్రవంతి, స్థానిక నేతలు శ్రీనివాస్, శ్రీశైలం, యాదగిరిగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రఘు, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

చండీహోమం

గౌతంనగర్: గౌతంనగర్ రైల్వేగేట్ సమీపంలోని దుర్గాభవానీ అమ్మవారి దేవాలయం అష్టాదశ వార్షికోత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు చండీహోమం, ప్రత్యేక పూజలు చేసి అన్నప్రసాద వితరణ చేశారు.

జన్మాష్టమి ఆహ్వాన పత్రికావిష్కరణ

కుషాయిగూడ: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో జరిగే శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికను సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్‌ఎస్ మాజీ అధ్యక్షుడు వంజరి ప్రవీణ్‌తో కలిసి ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంతం, హిందూ జ్ఞానవేదిక మల్లాపూర్ ఉత్సవ కమిటీలు సంయుక్తంగా నిర్వహించే ఈ వేడుకలకు హాజరు కావాలని కమిటీ అధ్యక్షుడు ఎం.వీ.నరసింహరావు తెలిపారు. ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నామన్నారు. చివరిరోజు స్వామివారి ఊరేగింపు ఉంటుందని వివరించారు.

'నులి'మేద్దాం!

- ప్రారంభమైన నులి పురుగుల నివారణ దినోత్సవం
- 1 నుంచి 19 ఏళ్ల లోపు ఉన్నవారికి 'ఆల్బెండజోల్' మాత్రల పంపిణీ



ఉప్పల్ జెడ్పీ స్కూల్‌లో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మేడ్చల్ డీఎంహెచ్‌ఓ ఉమాగౌరి

ఉప్పల్: నులి పురుగుల నివారణ దినోత్సవం ఉప్పల్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగింది. సోమవారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు (ఆల్బెండజోల్) నులి నివారణ మాత్రలు డీఎంహెచ్‌ఓ ఉమాగౌరితో కలిసి వేశారు. వారు మాట్లాడుతూ.. కడుపులో ఉన్న మలినాలు తొలిగిపోవడమే కాకుండా నట్టలు కూడా వెళ్లిపోతాయని, అందరూ విధిగా ఈ మాత్రను వేసుకోవాలని సూచించారు.

మండల పరిషత్ స్కూల్‌లో..

ఉప్పల్ మండల పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి 'ఆల్బెండజోల్'ను వేశారు. శరీరంలో ఉన్న ఇన్‌ఫెక్షన్‌ను ఈ మాత్ర తొలగిస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు ప్రతి బిడ్డకు ఈ మాత్రను వేయాలని సూచించారు.

తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి..

బోడుప్పల్: పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన నులిపురుగుల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 1 నుంచి 19 ఏళ్లున్న పిల్లల ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి తల్లిదండ్రులు సంరక్షకులుగా ఉండాలన్నారు.



మండల పరిషత్ స్కూల్‌లో కార్పొరేటర్ రజిత

మల్లాపూర్: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మల్లాపూర్ జెడ్పీ స్కూల్‌లో 'అల్బెండజోల్' మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ ధరణి, డాక్టర్ వినోద్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గౌతంనగర్: నులి పురుగుల నివారణకు 'ఆల్బెండజోల్' మాత్రలను విద్యార్థులు తప్పనిసరిగా వేసుకోవాలని కార్పొరేటర్ మేకల సునీత అన్నారు. సోమవారం గౌతంనగర్ విజయ మేరీ స్కూల్‌లో మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఏఎన్‌ఎంలు, స్కూల్ కరస్పాండెంట్ భీష్మారెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

మౌలాలి: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మౌలాలి డివిజన్‌లోని పలు స్కూళ్లల్లో విద్యార్థులకు నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్పొరేటర్ సునీత, బీఆర్‌ఎస్ నేతలు వంశీముదిరాజ్, మహమ్మద్ ఉస్మాన్, మారుతీప్రసాద్, డాక్టర్ ప్రత్యూష, వైద్య సిబ్బంది సరోజ, జ్యోతి, శిరీష, స్వప్న తదితరులున్నారు.



మల్లాపూర్ స్కూల్‌లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



విజయమేరీ స్కూల్‌లో కార్పొరేటర్ సునీత



మౌలాలి జెడ్పీ స్కూల్‌లో కార్పొరేటర్ సునీత

స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ లైన్ పరిశీలన



కాప్రా చెరువు వద్ద కార్పొరేటర్ స్వర్ణరాజ్, అధికారులు

కాప్రా: కాప్రా చెరువును కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సందర్శించారు. చెరువుకు నిర్మించిన స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ లైన్ పనితీరును సంబంధిత అధికారులతో కలిసి ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షపునీటి మళ్లింపునకు స్ట్రోమ్ వాటర్ డ్రెయిన్ వ్యవస్థను చేపట్టామని, ఈశ్వరిపురి, హైటెన్షన్ రోడ్డు నుంచి 2 లైన్లు, క్లాసిక్ ఎన్‌క్లేవ్ నుంచి ఒక లైన్ నిర్మించామని పేర్కొన్నారు. దీంతో వర్షపునీరు చెరువులోకి వస్తుందని, రోడ్లపై నీరు నిల్వకుండా నేరుగా చెరువులోకి వరద నీరు వస్తుందన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు మొదలుపెట్టాలి..

వినాయక చవితి పండగను దృష్టిలో పెట్టుకుని కాప్రా చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సూచించారు. గణేష్ నిమజ్జనం సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చెరువు వద్ద, కొలనులో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కాప్రా సర్కిల్ ఇంజినీరింగ్ విభాగం డీఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, కుషాయిగూడ పోలీసు సిబ్బంది, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బంజారాల సంప్రదాయ ప్రతిబింబమే తీజ్



తీజ్ ముగింపు వేడుకల్లో నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవి

కాకతీయనగర్ కాలనీలో ఘనంగా తీజ్ వేడుకలు

మేడిపల్లి: తరతరాలుగా బంజారా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే తీజ్ పండుగ ఉత్సవాలు పీర్జాదిగూడ నగర పాలక సంస్థ మేడిపల్లి కాకతీయనగర్ కాలనీలో తీజ్ వేడుకలు ఘనంగా జరిగాయి.ఈనెల 1న తీజ్ ఉత్సవాలు ప్రారంభం కాగా ఆదివారం సాయంత్రం ఊరేగింపుతో ముగిశాయి. వేడుల్లో భాగంగా మొదటిరోజు సేవాలాల్ మహరాజ్, మేరామాయాడి సన్నిధిని ఏర్పాటు చేసుకుని 9 రోజుల పాటు నిష్టతో సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంజారాల సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా పలు నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నిమజ్జనం సందర్భంగా ఆచారం ప్రకారం పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపులో మహిళలు లయబద్ధంగా చేసిన బంజారా సాంస్కృతిక నృత్యాలు, ఆటపాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. తీజ్ ఉత్సవ వేడుకలకు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, కాలనీ ప్రతినిధి భాగ్యశంకర్‌రెడ్డిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. శ్రీలతభద్రునాయక్, దేవివిజయ్, నిర్మల శంకర్, సుజాత తారాసింగ్, బానోత్ సుజాత, సుధాకర్, జ్యోతిమంగ్లీలాల్, గిరావత్ స్వరూప శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత టెండర్ విధానాన్నే కొనసాగించాలి

గురుకుల స్కూళ్లలో భోజన టెండర్ల మార్పు



కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కాప్రా: గురుకుల స్కూళ్లల్లో విద్యార్థులకు అందించే భోజన మెనూ టెండర్లలో నూతన విధానం కాకుండా పాత పద్ధతినే కొనసాగించాలని తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 2025–26 విద్యా సంవత్సరానికి కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, చికెన్, మటన్ సరఫరా చేసే టెండర్ విధానాన్ని మార్చారని, కొత్త టెండర్ విధానాన్ని అనుసరించే ఆర్థికస్తోమత తమకు లేదని వాపోయారు. టెండర్ విధానంలో మార్పుల కారణంగా వందల కుటుంబాలు రోడ్డునపడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఈనెల 13 నుంచి సరఫరా నిలిపేస్తున్నామని తేల్చి చెప్పారు. కాంట్రాక్టర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ.1.75 కోట్లతో అభివృద్ధి పనులు



శంకుస్థాపనలో మాజీ మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 14,15,16 డివిజన్లలో రూ1.75 కోట్లతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో మౌలిక వసతులైన తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు అధిక ప్రాధాన్యనిస్తున్నట్లు వివరించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. రా చెరువు సుందరీకరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు దుర్గమ్మ, కిరణ్‌కుమార్‌రెడ్డి, నాయకులు పోగుల దిలీప్‌రెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలో దరఖాస్తుల ఆహ్వానం

కుషాయిగూడ: కుషాయిగూడలోని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బోధన సిబ్బంది నియామకానికి తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైద్య కళాశాలలో బోధించేందుకు అసోసియేట్ ప్రొఫెసర్లు (4), అసిస్టెంట్ ప్రొఫెసర్లు (7), ట్యూటర్లు (5), సీనియర్ రెసిడెంట్లు (7) పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు ప్రభుత్వ వైద్య కళాశాల సీడీఎస్ అకౌంట్ పేరుపై రూ. 1000 డీడీ చెల్లించి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 18న ఈసీఐఎల్ ఎక్స్ రోడ్డు సమీపంలోని సువిధ ఆస్పత్రి పక్కన ఉన్న కుత్బుల్లాపూర్ మెడికల్ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నవకళ్యాణి 98492 30566.

లో ప్రెషర్ సమస్యను పరిష్కరించండి



రామంతాపూర్: ఓల్డ్ రామంతాపూర్‌లో కొద్ది నెలలుగా పలు బస్తీ నల్లాల్లో వచ్చే తాగునీటి సరఫరాలో సన్నటి ధారగా వస్తోందని ప్రజావాణిలో జలమండలి జీఎంకు స్థానికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ స్పందిస్తూలో ప్రెషర్‌గా తాగునీటి సరఫరాలో వస్తున్న మాట వాస్తవమేనని, త్వరలోనే తాగునీటి సరఫరా సమయాన్ని కూడా పెంచి ప్రెషర్ పెంచుతామని హామీ ఇచ్చారు. మాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బాబురావు, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి శివకుమార్, సుధాకర్, రజాక్ తదితరులున్నారు.

రాఘవేంద్రస్వామి మఠంలో మధ్వారాధన



మల్కాజిగిరి: రాఘవేంద్రస్వామి 354 ఆరాధనోత్సవాల్లో భాగంగా సోమవారం మల్కాజిగిరి వేంకటేశ్వరనగర్‌లోని మఠంలో మధ్వారాధన పూజా కార్యక్రమాలు జరిగాయి. ఉదయం అష్టాక్షర హోమం, కనకమహాపూజ, బృందావనానికి పంచామృతాభిషేకం, అలంకరణ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు జరిగాయి. నేడు ఉత్తరారాధనలో భాగంగా మహా రథోత్సవం జరుగుతుందని మఠం నిర్వాహకులు ప్రకటించారు.

ఉప్పల్-వరంగల్ జాతీయ రహదారి పరిశీలన

ఉప్పల్: గతుకుల కంకర తేలిన రోడ్లు, గుంతలతో ఉప్పల్ వరంగల్ రహదారి నరకప్రాయంగా మారింది. సోమవారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ట్రాఫిక్ అధికారులతో కలిసి రహదారిని పరిశీలించారు. ఉప్పల్ రోడ్డుపై కొంత దూరం కాలినడకన ప్రయాణించిన ఎమ్మెల్యే తక్షణమే కనీసం గుంతలను మట్టి పోసి రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అప్రమత్తమైన అధికారులు వెంటనే మట్టి పోసి మరమ్మతులు చేశారు. తమ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యేకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తి రిమాండ్

మేడిపల్లి: సెల్‌ఫోన్ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి భీంరెడ్డినగర్‌లో నివాసం ఉండే సలీం అనే వ్యక్తి సోమవారం ఉదయం 9గంటల ప్రాంతంలో మేడిపల్లిలో బస్సు ఎక్కబోతుండగా.. ఓ వ్యక్తి తనపై జేబులో ఉన్న సెల్‌ఫోన్‌ను దొంగిలిస్తున్నట్లు గుర్తించాడు. అప్రమత్తమైన అతడు ప్రయాణికుల సాయంతో నిందితుడిని పట్టుకుని మేడిపల్లి పోలీసులకు అప్పగించాడు. అనంతరం అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి, దొంగతనానికి యత్నించిన నరేష్(20)గా గుర్తించారు. చెడు వ్యసనాలకు బానిసై మొబైల్ ఫోన్లు దొంగిలించి అమ్మి, సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రజావాణిలో ఫిర్యాదుల వెల్లువ



ఫిర్యాదు చేస్తున్న ఉప్పల్ పట్టణ ప్రజలు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు వెల్లు వెత్తాయి. సోమవారం టౌన్ ప్లానింగ్ విభాగం నుంచి అనేక ఫిర్యాదులు అందినట్లు డీసీ రాజు తెలిపారు. వీధి లైట్లు తదితర వాటిపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఉప్పల్ సూర్యానగర్ కాలనీ, వేంకటేశ్వర్‌కాలనీ, లక్ష్మారెడ్డి కాలనీలకు వచ్చే రహదారి వెంట నిర్మాణాలు పూర్తిగా రోడ్డును ఆక్రమించి నిర్మిస్తున్నారని వాటివల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందన్నారు. వివిధ కాలనీల అధ్యక్షులు ధర్మారెడ్డి, లింగారెడ్డి, నర్సిరెడ్డి, జెట్ట సుధాకర్, ప్రేమ్‌సాగర్‌రెడ్డి, సంవేద్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: సర్కిల్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో 4 ఫిర్యాదులు అందాయని ఉప కమిషనర్ జకియా సుల్తానా తెలిపారు. రెవెన్యూ విభాగంలో రెండు, అర్బన్ బయోడైవర్సిటీ విభాగంలో 1 , యూసీడీ విభాగంలో వచ్చిన 1 ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారన్నారు. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సర్కిల్ కార్యాలయంతో పాటు, జోనల్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో అకాల వర్షాలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, అత్యవసర సమావేశం నిర్వహించాలని కోరారు. ప్రత్యేకంగా మాన్‌సూన్ పెట్రోలింగ్ టీమ్స్ ఏర్పాటు చేయాలని సూచించామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మల్కాజిగిరిలో పార్కును పరిశీలించిన డీసీ జకియా సుల్తానా

మల్కాజిగిరి: అకాల వర్షాలు కురుస్తున్నాయని సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి సర్కిల్ డీసీ జకియా సుల్తానా సూచించారు. సోమవారం సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి అవగాహన నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో కాలనీల్లోని పార్కులు, బహిరంగ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తాగునీరు కూడా కాచి వడగట్టి తాగడం వలన వ్యాధుల భారిన పడకుండా ఉంటామన్నారు. ఇంటింటికి వచ్చే చెత్త సేకరణ కార్మికులకు సహకరించి చెత్తను అందజేయాలని బహిరంగ ప్రదేశాల్లో పారవేయకూడదన్నారు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకున్నా ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఏఎమ్‌హెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్‌వైజర్ చింత శ్రీనివాస్, పీవో మల్లికార్జున్, ఎస్‌ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మర్రి

అల్వాల్: నియోజకవర్గ పరిధిలోని పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ.. నిరుపేదలు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఆర్‌ఎస్ నేతలు డోలి రమేష్, చందు, బాలకృష్ణ, శ్రీను, సంపత్‌యాదవ్, అరుణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని ప్యాచ్‌వర్క్స్!

- ప్రతి ఏటా వృథా అవుతున్న ప్రజాధనం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీ సంఘాలు



ఉప్పల్ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి చిలుకానగర్ వెళ్లే రహదారి



చిలుకానగర్‌లో రోడ్డు పరిస్థితి

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో ప్యాచ్‌వర్క్స్ వేసిన 2–3 రోజుల్లోనే తిరిగి యథావిధిగా ఇసుక కంకర తేలి అలాగే ఉంటోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్యాచ్‌వర్క్స్ కోసం స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇంజినీరింగ్ విభాగం అధికారుల పర్యవేక్షణ లోపంతో సగం మేర వదిలేసి వెళ్తున్నారని పలువురు పెదవివిరుస్తున్నారు.

4 డివిజన్లలోనూ ఇదే పరిస్థితి..

రోడ్లు దెబ్బతిన్న 4డివిజన్ల పరిధిలోనూ ఇదే పరిస్థితి కనబడటం ఆందోళన కలిగించే అంశం. ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్లకు సైతం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలోనే ప్యాచ్‌వర్క్స్ వేస్తుంటారు.

దీనికోసం ప్రత్యేక టీమ్‌లు ఉన్నా.. ప్రయోజనం లేకుండా పోయింది. ఎటు చూసినా ప్యాచ్‌వర్క్స్ ఇసుక, కంకర తేలి గుంతలు ఏర్పడి మరింత ఇబ్బందిగా మారుతున్నాయి. గతుకుల కారణంగా ద్విచక్ర వాహనదారులు అధికంగా ప్రమాదాల పాలవుతున్నారు.

ప్యాచ్‌వర్క్స్ ఎక్కువ రోజులు ఉండవు

ప్యాచ్‌వర్క్స్ 1–2 రోజులు తప్పా.. ఎక్కువ కాలం మన్నికగా ఉండవు. హెడ్ ఆఫీస్ నుంచి వచ్చిన మెటీరియల్ యాథావిధిగా వేస్తున్నారు.
– హరిలాల్, ఉప్పల్ ఈఈ